www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 3 సెప్టెంబర్ 2023

5

తూర్పుగోదావరి



ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుకు 5వ తేదీ గడువు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల సంచాలకుల ఉత్తర్వుల మేరకు జిల్లాలో 2023-24వ సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)కు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 15 వరకూ సమయం ఉందని డిఇఒ ఎస్.అబ్రహాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులందరూ ఆసక్తిగల విద్యార్థులతో దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ అన్నారు. మరిన్ని వివరాలకు డిఇఒ కార్యాలయంలో లేదా www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఆయన అన్నారు.

ఆన్‌లైన్ లోన్ల జోరు.. రుణ గ్రహీతల బేజారు

- నగదు చెల్లించినా చెల్లించలేదంటున్న రికవరీ ఏజెంట్లు
- వ్యక్తిగత జీవితంలో ప్రవేశిస్తూ అసభ్యకర సందేశాలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆన్‌లైన్ లోన్ యాప్‌ల నిర్వహకుల వేధింపులు రోజు రోజుకీ పెచ్చరిల్లుతున్నాయి. దీంతో రుణ గ్రహీతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహకుల వేధింపులు తాళలేక బలవన్మరణాలకు సైతం పాల్పడుతున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో జరిగిన ఘటనలు ఆన్‌లైన్ లోన్ల వేధింపులను దర్పణం పడుతోంది. కరోనా సమయంలో ఆర్థిక కష్టాల నుంచి బయట పడేందుకు సామాన్యులు అత్యధిక మంది ఆన్‌లైన్ లోన్ యాప్‌ల వలలో చిక్కారు. యువతను ఐపిఎల్ మ్యాచ్‌ల ఫలితంగా బెట్టింగులు, వ్యసనాల కోసం యువతసైతం ఇబ్బడి ముబ్బడిగా రుణాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే అత్యధిక మంది తాము లోన్ పొందే సమయంలో చెప్పిన వడ్డీ రేట్లకు చెల్లించిన సమయంలో వేసే వడ్డీ రేట్లకు భారీ వ్యత్యాసం ఉందని వాపోతున్నారు. ప్రస్తుతం చలామణిలో ఉన్న ఆన్‌లైన్ లోన్ యాప్‌లకు ఆర్‌బిఐ అనుమతులు లేనివని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అత్యధిక యాప్‌లు ఇతర దేశాలకు చెందినవని నిపుణులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ ట్రాప్‌లో పడొద్దంటూ హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ప్రజలు లోన్‌యాప్‌ను క్లిక్ చేసి లోపలికి ప్రవేశిస్తే ఆధార్, పాన్‌కార్డులతోపాటు సెల్ఫీ ఫొటో ఇవ్వమంటారు. మన ఫోన్‌లో ఉన్న నెంబర్లు, మెసేజ్‌లు, గ్యాలరీలో ఫొటోలు, ఫేస్‌బుక్.. ఇలా ఫోన్‌లో ఉపయోగించే అన్నియాప్‌కు సంబంధించిన వారు చూసేలా అనుమతులు ఇవ్వాలని కోరుతారు. ఒకే అని క్లిక్ చేస్తే వెంటనే బ్యాంకు అకౌంట్ నెంబరు, బ్యాంకు ఐఎఫ్ఎస్‌సీ అడుగుతారు. కస్టమర్ నుంచి అన్ని రకాల డేటా సేకరించిన తర్వాత అడిగినంత ఇవ్వలేమని తేల్చి చెబుతున్నారు.

అసలు కంటే వడ్డీలే అధికం

రాజమహేంద్రవరంలోని కంబాల చెరువులోని ఓ వ్యక్తి ఆ తర్వాత రూ.20 వేలు రుణం అడిగితే ముందుగా కొంత నగదు మాత్రమే ఇచ్చి, వారంలోపు చెల్లించాలని సూచించినట్లు వాపోయారు. ఉదాహరణకు రూ.2 వేలు లోన్ ఇస్తే వారానికి రూ.3,500 చెల్లించాలని మెసేజ్ పెడతారు. అంటే రూ.2 వేలకు రూ.1,500 వడ్డీ వసూలు చేస్తారు. ఇదిలాఉంటే తీసుకున్న మొత్తం చెల్లించాలంటే యాప్‌లో ఇచ్చిన అకౌంట్‌కు పంపాలని ప్రయత్నిస్తే టెక్నికల్ ఇబ్బందులు అంటూ మెసేజ్‌లు వస్తాయి. రుణం తీసుకున్న మరుసటి నెల నుంచే వేధింపులు ప్రారంభం అవుతున్నాయి. ఒక వారం చెల్లింపు ఆలస్యమైతే రికవరీ ఏజెంట్ అంటూ లైన్‌లోకి వస్తాడు. లేటుగా రుణం చెల్లిస్తున్నారు.. అంటూ వడ్డీకి వడ్డీ వేస్తారు ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తే మన ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్ నెంబర్లకు ఫోన్ చేసి వారిని కూడా నిలదీస్తారు. వారు చెప్పినంత నగదు చెల్లించకపోతే మన గ్యాలరీ, వాట్సప్‌లో ఉన్న ఫొటోలు తీసుకొని రేపిస్ట్, హంతకుడు అంటూ... ఫొటోకింద క్యాప్షన్ రాసి మన కాంటాక్ట్ నెంబర్లకు పంపుతారు. ఇలా మానసికంగా వేధిస్తున్నారని తెలుస్తోంది. చివరకు వారు అడిగినంత నగదు చెల్లించినా, కొద్ది రోజులకు మరొకరు లైన్‌లోకి వచ్చి నగదు చెల్లించలేదు.. వారెవరికో చెల్లించారు.. అంటూ మళ్లీ వేధిస్తారు. ఈ వేధింపులు తట్టుకోలేక పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

డౌన్‌లోడ్ చేస్తే ఇబ్బందులు తప్పవు

రుణ యాప్‌ల్లో చాలావరకు ఆర్‌బిఐ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, అలాంటి వాటిని డౌన్‌లోడ్ చేసుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇన్‌స్టెంట్ లోన్ల పేరుతో బురిడీ కొట్టించే యాప్‌ల్ని నమ్మి మోసపోవద్దని, ఆ యాప్‌ల నుంచి ఇప్పటికే రుణాలు పొందినవారు వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు. ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి ఇవ్వరాదని నిపుణులు సూచిస్తున్నారు. లోన్‌ల యాప్‌ల బెదిరింపులు, నోటీసులకు బాధితులు భయపడకుండా ధైర్యంగా న్యాయపోరాటం చేయాలని వారంటున్నారు. లోన్ యాప్‌లు పెడుతున్న ఇబ్బందులు గురించి మిత్రులు, బంధువులకు వివరించి చెప్పడం మంచిదని అంటున్నారు. వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆధారాలను సేకరించి పోలీసుల దష్టికి తీసుకెళ్లడం మంచిదంటున్నారు. ఆన్‌లైన్ యాప్‌లో లోన్లు తీసుకొని నగదు సక్రమంగా చెల్లిస్తున్నా, ఇబ్బందులకు గురిచేస్తుంటే బాధితులు నేరుగా ఆయా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేయొచ్చు.

పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్

పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాధవీలత



పాల్గొన్న కలెక్టర్,జెసి, అధికారులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నత స్థాయి అధికారులు కలెక్టర్ లతో సాగునీరు , రెవెన్యూ, రీ సర్వే, వ్యవసాయం, హౌసింగ్, గ్రామ వార్డు సచివాలయం లో మానవ వనరులు, జేకేసి పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత జిల్లా ప్రగతి వివరించారు. జిల్లా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత భవనాలు నిర్మాణం పూర్తి చేసిన వాటిని స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 85,183 హెక్టార్ల కు గాను 72,663 హెక్టార్ల లో సాగు విస్తీర్ణం, రైతులు పంట వెయ్యడం పూర్తిచేశారన్నారు. ఈ-క్రాప్ కు చెంది 2,96,295 ఎకరాలకు గాను 112266 ఎకరాల్లో బుకింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా సమన్వయం చేస్తూ 100 శాతం లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ పంట నమోదు కింద 1,01,054 మందికి గాను 94,019 మంది నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జగనన్న భూ హక్కు భూ రక్ష పథకం కింద 35,114 హక్కు పత్రాలకు గానూ 11,185 హక్కు పత్రాలు యజమానులకు పంపిణీ చేశామని తెలిపారు. రీ సర్వే ఫేజ్ -2 లో చేపడుతున్న 54 గ్రామాలకు గాను 18 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తిచేశామని, రాబోయే 15 రోజులకు మరో 18 గ్రామాలలో చేపట్టెందుకు కార్యాచరణ సిద్దం చేసినట్లు వివరించారు. జిల్లాలో జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 2 వరకు సగటు వర్షపాతం 611.7 మీ మీ లకు గాను 491.3 మీ మీ వర్షపాతం నమోదైనట్లు, జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదు అయినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అడుగడుగునా నీరాజనం

రెండోరోజు కొనసాగిన లోకేష్ యాత్ర



లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-నల్లజర్ల

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర శనివారం ఉదయం నల్లజర్ల మండలం ఆవుపాడులోని క్యాంపు నుంచి ప్రారంభమైంది. ఆవుపాడు, సింగరాజుపాలెం మీదుగా ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చేరుకుంది. ఆయా గ్రామాల్లో ప్రజలు లోకేష్‌కు అడుగడుగున నీరాజనం పలికారు. సింగరాజుపాలెంలో జడ్‌పిటిసి మాజీ సభ్యులు కొటారు అనంతలక్ష్మి, మాజీ సర్పంచ్ కొటారు గాంధీ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు, కొటారు గాంధీ, యద్దనపూడి బ్రహ్మరాజు, మాజీ ఎంపిపి జమ్ముల వీరవెంకటసతీష్, టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ పాల్గొన్నారు.

బాబుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న చంద్రబాబుకు స్థానిక టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. టిడిపి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం కాకినాడలో ప్రారంభం కానుంది. ఆయన శనివారం మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసు, రాజానగరం నియోజ కవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు గన్ని దుశ్శాలువా కప్పి స్వాగతం పలికారు. అక్కడ నుంచి చంద్రబాబు కాకినాడకు పయనమయ్యారు.

రహదారి విస్తరణకు సహకరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో ప్రధాన రహదారులైన మోరంపూడి రోడ్డు మరియు తూర్పు రైల్వే స్టేషను రోడ్డు విస్తరణకు నివాసితులు సహకరించాలని కమిషనరు కె.దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మోరంపూడి రోడ్డు మరియు తూర్పు రైల్వే స్టేషను రోడ్డు నివాసితులతో నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. మోరంపూడి రోడ్డు మరియు తూర్పు రైల్వే స్టేషను రోడ్డులను మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా విస్తరణ చేయడం జరుగుతుందని, మోరంపూడి రోడ్డుకు సమాంతరంగా ట్రాఫిక్ రద్దీ తగ్గించుటకు ఆవలో 100 అడుగుల రోడ్డు నిర్మాణము చేస్తున్నా మన్నారు. రోడ్డు విస్తరణ వల్ల స్థలం కోల్పోయిన వారికి ట్రాన్ఫర్ డెవలప్మెంటు రైట్స్ ఇవ్వబడ తాయన్నారు. నివాసితులం దరూ సదరు స్థలాలను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పేరున రిజిస్ట్రేషను చేయాలని కోరారు.



వీసీ పద్మరాజు ని కలిసిన నూతన ఈసీ మెంబర్లు

'నన్నయ్య' ఇసి మెంబర్స్ నియామకం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ నూతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం యూనివర్సిటీ వీసీ కార్యలయంలో విసి కె.పద్మరాజు నూతన ఈసీ మెంబర్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం జిఒ 77ను విడుదల చేసిందన్నారు. ఆయా విభాగాల నుంచి నిష్ణాతులైన వారిని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్స్‌గా నియమించిందన్నారు. నూతన కార్యనిర్వహక మండలి సభ్యులుగా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ పెన్మత్స సురేష్‌వర్మ, యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయ నిర్మల, అనుబంధ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి, యూనివర్సిటీ కాలేజ్ అధ్యాపకులు డాక్టర్ కె.నూకరత్నం, అనుబంధ కళాశాల అధ్యాపకులు వసంతలక్ష్మి, ఇడిసిఐఎల్ జనరల్ మేనేజర్ షేక్ సులేమాన్, లిటిల్ రోజ్ డిగ్రీ కాలేజ్ ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్ గంధం నారాయణరావు, దేవి ఆక్వాఫీడ్స్ జనరల్ మేనేజర్ రాజ్‌కుమార్, కమర్షియల్ టెక్సీస్ ఫార్మర్ డిప్యూటీ కమీషనర్ వై.సత్యనారాయణ నియమితులయ్యారని తెలిపారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేయాలని విసి సూచించారు. నూతనంగా నియమితులైన ఈసీ మెంబర్స్‌కు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి



రొట్టెలు, పండ్లు అందజేస్తున్న ఎంఎల్ఎ తలారి వెంకట్రావు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. **రాజమహేంద్రవరం** మార్కెట్ సెంటర్‌లో అజ్జరపు వాసు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ మార్గాని భరత్, వైసిపి కో-ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ ప్రారంభించారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. **గోకవరం** పాత బస్టాండ్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి సుంకర శ్రీవల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** మంత్రి వనిత ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతిని నిర్వహించారు. ముసలమ్మ గుడి వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పేదలకు దుస్తులను అందించారు. **రాజమహేంద్రవరం రూరల్** వైసిపి కార్యాలయంలో చందన నాగేశ్వర్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికలాంగులకు బ్యాటరీ చైర్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్ పంపిణీ చేశారు. తాడాల చక్రవర్తి, ముత్యాల పోసికుమార్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు. **నిడదవోలులో** కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, ఉషారాణి, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. **పెరవలి** మండలం పెరవలి సెంటర్లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మ, రాష్ట్ర శెట్టిబలి సంఘం ఉపాధ్యక్షులు జక్కం శెట్టి రాజేంద్రప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు వీరమల్లు సత్యనారాయణ, స్టేట్ డైరెక్టర్స్ పసలపూడి భద్రయ్య కార్యకర్తలు పాల్గొన్నారు. **గోపాలపురం** ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజును నిర్వహించారు. భారీ కేక్ కట్ చేశారు. పెద్దగూడెం ఎలిమెంటరీ స్కూల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో భగవాన్, పిల్లి కాంతారావు, పోసిన గణపతి, ఉమామహేశ్వరరావు, ఫణీంద్ర, రాంబాబు, సతీష్, జి.సత్యనారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలం కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని స్పందన బాలబాలికలకు పండ్లు, మిఠాయిలు పంచారు. తణుకు వద్ధాశ్రమంలోని కేక్ కట్ చేశారు. ఎంపిటిసి కాకర్ల కరుణాకర్, వి.బాలాజీ, కె.నాని, జి.కొండలరావు పాల్గొన్నారు. **పెరవలి** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవికుమార్ అధ్యక్షతన మండలంలోని మొక్కలు నాటారు. **కడియం** గ్రామంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ఎన్.మూర్తి, దొడ్డా బుజ్జి, శాకా పట్టాభి, పసల నాయుడు పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం** వైఎస్ఆర్ వర్ధంతిసందర్భంగా స్థానిక మార్కండేయ స్వామి రేవులో రాజశేఖరరెడ్డి చిత్రపటానికి గోదావరి పరి రక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రంతో ముద్రించిన టీ షర్టులను ఆయన పంచి పెట్టారు. వైఎస్ ఆర్ స్మృతి చిహ్నంగా గోదావరి రేవును శుభ్రపరిచి సేవా దక్పథాన్ని చాటారు. అపర భగీరథుడిగా, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు అందరూ కృషిచేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, పిసిసి సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలేపల్లి మురళీధర్ పిలుపునిచ్చారు. వైఎస్ఆర్ 14వ వర్ధంతి సందర్భంగా స్థానిక కృష్ణనగర్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పిసిసి సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బత్తిన చంద్రరావు, ఎండిషహేన్‌షా, చామర్తి లీలావతి, యిజ్జరౌతు విజయలక్ష్మి, మధుమణి, ఆలీ, రాజు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తానేటి వనిత



గుంతలతో దర్శనమిస్తున్న ముక్కామల రోడ్డు

గుంతలమయంగా ముక్కామల రోడ్డు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని నల్లకులవారిపాలెం జాతీయ రహదారి నుంచి గోదావరి ఏటిగట్టు ఎర్ర వంతెన వరకు ఉన్న రోడ్డు గోతులమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. లంకమాలపల్లి, ముత్యాలవారిపాలెం, ముక్కామల, గవర్లపాలెం చెందిన ప్రజలు నిత్యం ఇదే రోడ్డుపై రాకపోకలు సాగిస్తారు. తణుకు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదొక్కటే ప్రధాన రహదారి. కొంతకాలంగా రోడ్డు శిథిలమవ్వడంతో తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులిపేసుకున్నారు. ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో గుంతల్లోకి నీరు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, కనీసం మరమ్మతులైనా

నన్నయ్య వర్సిటీకి 125 అధ్యాపక పోస్టుల మంజూరు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ 125 అధ్యాపక పోస్టులు మంజూరయ్యాయని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శనివారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన వివరాలను విసి తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు పోస్టులను ఉన్నత విద్యామండలి హేతుబద్ధీకరిస్తూ ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. ఈ నేపథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి 128 అధ్యాపక పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వీటిలో మూడు పోస్టులను ఆయా కారణాలతో నిలుపుదల చేశారనిఅన్నారు. నన్నయ యూనివర్సిటీలో ఇప్పటికే 26 పోస్టులు వివిధ కేటగిరీల్లో ఉండగా అదనంగా 99 మందిని నియమించేందుకు అవకాశం లభించందని చెప్పారు. వీటిలో 77 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 33 అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయన్నారు. నవంబర్ 14లోగా కొత్తగా మంజూరైన పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని అన్నారు.

100 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి - పెరవలి

మండలం అన్నవరప్పాడు వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో రావులపాలేనికి చెందిన సాయి స్పందన హోమియో హాస్పిటల్ వారు శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సోని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సౌజన్య, మిడతాని సురేష్‌కుమార్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

9న ఎస్‌సి, ఎస్‌టి రాజ్యాంగ హక్కుల రక్షణ సదస్సు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

విజయవాడలో ఈనెల 9న ఎస్‌సి, ఎస్‌టి రాజ్యాంగ హక్కుల రక్షణ సదస్సును నిర్వహిస్తున్నామని మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ తెలిపారు. శనివారం కొవ్వూరు 4వ వార్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో మాలమహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకట్రావు సదస్సుకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌స, ఎస్‌టిలకు భారత రాజ్యాంగం అందించిన హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. శ్యామ్‌రవిప్రకాష్ మాట్లాడుతూ రాజ్యాంగం హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మల ఫ్రాన్సిస్, బొంతా కిషోర్, ఎం.మురళి, బి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు

ప్రజాశక్తి - యంత్రాంగం

పవన్ కళ్యాణ్ పుట్టినరోజును జిల్లాలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. **పెరవలి** మండలం ముక్కామలలో కేక్ కట్ చేసి పంచారు. విద్యార్థులకు చాక్లెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. రేలంగి రాజేష్, ఓదూరి నరసింహస్వామి, జి.ముసలయ్య పాల్గొన్నారు. **చాగల్లు** మండలంలోని కలవలపల్లిలో జరిగిన కార్యక్రమానికి పార్టీ కొవ్వూరు ఇన్‌ఛార్జి టివి.రామారావు హాజరయ్యారు. **సీతానగరంలో** జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. వెదుళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు పంచారు. కార్యక్రమంలో కె.విజయ్‌శంకర్, మట్టా వెంకటేశ్వరరావు, ఎం.పోసియ్య, సూర్యకుమారి, లక్ష్మి పాల్గొన్నారు. మదర్ థెరిసా సెంటర్‌లో వైసిపి మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాసరావు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పెదపాటి డాక్టర్‌బాబు, ఎం.కొండలరావు, దాకే రఘు పాల్గొన్నారు. **తాళ్లపూడిలో** ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. గంటా కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బైక్ ర్యాలీ చేపట్టారు. **ఉండ్రాజవరం** వేలివెన్ను పిఎసిఎస్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కరరామయ్య వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. కఠారి సిద్ధార్థరాజు, బి.కృష్ణ బ్రహ్మానందం తదితరులుపాల్గొన్నారు. **చాగల్లు** ఎంపిపి ఎం.వీరస్వామి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **తాళ్లపూడి** గజ్జరంలో సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు, వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు మలకపల్లిలో కుంటముక్కల కేశవ నారాయణ, ప్రక్కిలంకలో సర్పంచ్ యాళ్ల స్వప్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **గోపాలపురం** చెక్ పోస్ట్ సెంటర్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సొసైటీ అధ్యక్షులు కూసం రామ్మోహన్ రెడ్డి సమకూర్చిన దుప్పట్లను వృద్ధులు, వితంతవులకు, పేదలకు అందించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, ఎస్‌కె.ఖాదర్‌వలీ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, సర్పంచ్ పైడి శిరీష, వైస్ ఎంపిపి బాదిన వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసి సభ్యులు జోగి సూర్యకుమారి, సంగీత, నాయకులు పాల్గొన్నారు. **కడియంలో** పెద్ద వినాయకుడు గుడివద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి కందుల న్యూరో కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కందుల కృష్ణ తేజ ఆధ్వర్యంలో 500 మంది రోగులకు వైద్య సేవలందించారు. జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ మాట్లాడారు. ఎం.జమ్మి, వైస్ ఎంపిపి పంతం గణపతి, రత్నం అయ్యప్ప, ఆదిమూలం సాయిబాబా, మల్లు శివ పాల్గొన్నారు. **దేవరపల్లి** పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా యర్నగూడెం మరియు దేవరపల్లి బస్టాండ్ సమీపంలో గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు కేక్ కట్ చేశారు కార్యక్రమానికి దేవరపల్లి అధ్యక్షులు కంబాల సత్తిబాబు, జాజిమొగ్గల శ్రీను, కొడమంచిలి శ్రీను, సూరిశెట్టి బాలాజీ, సిద్ధా తాతబ్బాయి, గంట సురేష్, గంట మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దగూడెంలో విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన జనసేన నేతలు



దేవరపల్లిలోకేక్‌కట్‌చేస్తున్నజనసేన నాయకులు

నేరాలు ఘోరాలు

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన కె.గంగరాజు సారాను తరలిస్తుండగా శనివారం కొత్తపేట ఎస్సీబీ సీఐ మద్దాల శ్రీనివాస్ అదుపులో తీసుకున్నారు. అతని నుంచి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమర్తి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

పశువుల స్వాధీనం : కేసు నమోదు

ప్రజాశక్తి - పిఠాపురం

పార్వతీపురం నుంచి సామర్లకోటకు అక్రమంగా తరలిస్తున్న గోవులను పిఠాపురం పోలీసులు పట్టుకున్నారు. సిఐ వైఆర్కె శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలో ఎఫ్.కె పాలెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గోవుల అక్రమ రవాణా చేస్తున్న 3 మహీంద్రా బొలెరో పికప్ ఆటోలను రూరల్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ వాహనాల్లో 20 ఎద్దులు,17 ఆవు దూడలు ఉన్నాయి. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి ఆటోలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గోవులను సంరక్షణ నిమిత్తం వరణక్కపేటలోని గోశాలకు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.



కారు ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన గొర్రెల దృశ్యం

35 గొర్రెలను ఢీకొన్న కారు

ప్రజాశక్తి - గోపాలపురం

అతివేగంగా వస్తున్న కారు గొర్రెలను ఢీకొట్టిన సంఘటనలో 20 గుర్రెలు మృతిచెందగా 15 గొర్రెలు కాళ్లు విరిగిపోయి కొనప్రాణాలతో కొట్టుమిట్టు లాడుతున్నాయి. ఈ సంఘటనకు సంబంధించి గొర్రెల కాపరి (యజమాని)గంధం శ్రీనువాస్ తెలిపిన ప్రకారం గోపాలపురం శివారు టొబాకో బోర్డు సమీపంలో శనివారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో గొర్రెలు నేషనల్ హైవేపై వస్తుండగా దేవరపల్లి వైపు నుంచి గోపాలపురం వైపు అతి వేగంగా వస్తున్న ఇన్నోవా ఏపీ 37 డిఆర్ 4545 నెంబర్ గల కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో సుమారు 20 గొర్రెలు మృతి చెందగా సుమారు 15 గొర్రెలు కాళ్లు విరిగి కొనప్రాణంతో ఉన్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు 5 లక్షలకు పైగా ఉంటాయని యజమాని తెలిపారు. కారు ఆపకుండా దురుసుగా అతివేగంగా వెళ్ళిపోయాడు. కారు బీమోలు రోడ్డు గల ఇటుకుల బట్టి వద్ద నిలుపుదల చేసి డ్రైవర్ పారిపోయినట్లు పలువురు తెలిపారు.

వర్షం పడితే రహదారి బంద్

ప్రజాశక్తి - పెద్దాపురం

వర్షం పడితే స్థానిక ఒక్క లంక వారి వీధి - ప్లీడర్ల వీధి సెంటర్ నుంచి మహారాణి సత్రం వీధి రహదారి ప్రారంభంలో వర్షం నీరు ప్రవహించే దారి లేక మోకాళ్ల లోతు నీరు నిలిచిపోతుంది. అనేక సంవత్సరాలుగా ఈ పరిస్థితి నెలకొంటున్నా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ రహదారి పరిసరాల్లో డ్రైనేజీలు ఆక్రమణ లకు గురికావడం, పూడుకుపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పెద్దాపురం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు ఈ రహ దారి మీదుగానే ప్రవహిస్తోంది. ఈ వర్షం నీటి ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని రహదారికి ఇరు వైపులా గతంలో పెద్ద డ్రైన్లు నిర్మించారు. ఈ డ్రైన్లు క్రమేపీ ఆక్రమణలకు గురవుతున్నాయి. మరోపక్క పూడుకుపోయిన డ్రైన్ల లో ఎప్పటికప్పుడు పూడిక తీయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటోందని ప్రజలు విమర్శి స్తున్నారు. ఈ నీరు నిలిచిపోవడంతో మెయిన్ రోడ్డు నుంచి సత్రం వీధి మీదుగా కొత్తపేట, నాగమ్మపేట తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు, వాహనదారులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జనసేనలో బిక్కిన రాజశేఖర్ చేరిక

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోటకు చెందిన తెలుగు యువత జిల్లా నాయకుడు బిక్కిన రాజశేఖర్ జనసేనపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జనసేన పెద్దాపురం నియోజకవర్గం పార్టీ ఇన్చార్జి తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వర్యంలో మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాల యంలో శు క్రవారం రాత్రి పార్టీ అగ్రనాయకుడు నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేనలో చేరారు. బిక్కిన రాజశేఖర్కు నాదేండ్ల మనోహార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బిక్కిన రాజశేఖర్ ప్రముఖ పారిశ్రామికవేత్త, భీమేశ్వరా లయం వద్ద పోటీగా అన్నదాన ట్రస్టు నిర్వాహి స్తున్న మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు బిక్కిన సాయి కుమారుడు. బిక్కిన తోపాటు సామర్ల కోటకు చెందిన పోలినాటి గౌతమ్ అభిషేక్, చిన్నా, అమలకంటి బాబు, తోపాటు పి వేమ వరం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సృజన బాబు తదితరులు న్నట్లు తుమ్మలబాబు తెలిపారు.



హాస్టల్‌కు దోమల మెస్ ఏర్పాటు

ప్రజాశక్తి -కరప

మండలంలోని కరపలో సాంఘిక సంక్షేమ వసతి గృహంలో గల కిటికీలకు దోమల నివారణ మిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు దోమ కాటుతో ఇబ్బంది పడుతున్న కారణంగా జనసేన పార్టీ కార్యకర్తలు తదేకం ఫౌండేషన్ సాయంతో శనివారం పంతం సందీప్ ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భోగి రెడ్డి కొండలరావు, భోగిరెడ్డి గంగాధర్, బండారు మురళి, సుందర సత్తిబాబు సైనవరపు, భవాని శంకర్, యాళ్ల పండు, కాకినాడ రూరల్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోరాటాల హోరు... నిరసనల జోరు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజా సమస్యలపై వామపక్ష పార్టీల పోరాటాలు ఈ వారంలో హోరెత్తాయి. ఆ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై 'సిపిఎం సమరభేరి' పిలుపు ఇచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజా సమస్యలపై నిర్వహిస్తున్న ఆందోళనలు, సంతకాల సేకరణ కార్యక్రమాలలో ప్రజలు స్వచ్ఛంధంగా పాల్గొని తమ మద్దతు తెలుపుతున్నారు. బిజెపి అనుసరిస్తున్న విధానాలను అత్యంత వేగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి సైతం రాబోయే రోజులలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. 2014 ఎన్నికల ముందు ఇచ్చిన అనేక హామీ లను మోడీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసిన విషయం విధితమే. రాష్ట్ర ప్రయోజనాలను సైతం పక్కన పెట్టిన గత తెలుగుదేశం ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి తప్పదనే హెచ్చరికలు విన్పిస్తున్నాయి. మరోవైపు రిజిస్ట్రేషన్ శాఖలో ప్రకంపనలు మొద లయ్యాయి. దస్తావేజు లేఖర్లు చేపట్టిన పెన్‌డౌన్ కార్యక్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విజయవంతంమైంది. డిజిటల్ విధానం పేరుతో ప్రభుత్వం అనుసరిం చబోయే నూతన విధా నంతో ప్రజల ఆస్తులకు సైతం రక్షణ ప్రశ్నార్ధకంగా మారనుం దని తెలుస్తోంది. దీంతో గడిచిన వారం రోజులలో రిజిస్ట్రేష న్లపై తీవ్ర ప్రభావం కన్పించింది. ప్రభుత్వం ఇప్పటికైనా పునరా లోచిం చి పాత విధానాన్నే అమలు చేయాలనే డిమాండ్ వ్యక్తమ వుతోం ది. రాష్ట్ర ప్రభుత్వం మేరకు స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

ఓ వైపు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పన్నుల భారాలతో సామాన్య, దిగువ మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు నానాటికి క్షీణిస్తున్నాయి. ఈ పరిస్థితులలో



వామపక్ష పార్టీలు మాత్రమే ప్రజలకు అండగా నిలబడి ప్రజా సమస్యలపై ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయి. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలను నిలదీస్తున్నాయి. అయితే రాష్ట్రంలోని తెలుగు దేశం, వైసిపి పార్టీ శ్రేణులు పూర్తిగా ప్రజా సమస్యలను విస్మరించాయి. బిజెపి ప్రభుత్వాన్ని ఎక్కడా నిలదీసే పరిస్థితులు కన్పించడంలేదు. మరోవైపు రాబోయే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా సమీకరణలు ప్రధాన పార్టీలు కసరత్తు ప్రారంభిం చాయి. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని తాజాగా కాకినాడ సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరో వైపు యువగళం పేరుతో ఆ పార్టీ యువనేత లోకేష్ చేపట్టిన పాదయాత్ర ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించింది. నల్లజర్లలోకి ప్రవేశించిన యువగళం కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యలను ఏకరవుపెట్టారు. ఆ సమస్యలన్నింటినీ తాము అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామంటూ యువతనే చెప్పి యాత్రను కొనసాగించారు. మరోవైపు వైసిపి ప్రజా ప్రతినిధులు తమ స్థానాలను నిలబెట్టుకోవటం కోసం పాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడక్కడా అసంతృప్తులు, ఒకొరిపై ఒకరు విమర్శలు, ప్రతివిమర్శలు ఒక్కొటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ రెండు పార్టీలు విధానపరమైన అంశాలపై స్పష్టత ఇవ్వకుంటే రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదు.

జిల్లా ప్రజలను సీజనల్ వ్యాధులు చుట్టుముట్టడంతో ఆనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతు న్నారు. గత నెలలో కళ్ల కలకలతో అత్యధిక మంది అస్వస్థతకు గురౌన విషయం విధితమే. తాజాగా జ్వర పీడితుల సంఖ్య క్రమ క్రమంగా పెరగటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు నేతి బీర చందంగా మారాయి. బ్లడ్ టెస్ట్‌లు మొదలు కొని వివిధ రకాల పరీక్షలు, మందులు ప్రభుత్వ ఆస్పత్రులలో లభించడం లేదు. అత్యధిక మందిని జిల్లాలో ప్రధాన ఆస్పత్రు లైన రాజమహేంద్రవరం, కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వెనకడుగు వేస్తున్నారు. తప్పని సరి పరిస్థితులలో తమ గ్రామాల్లోనే ఆర్ఎంపిలు, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికల కోసం పోరుబాట

తూర్పుగోదావరి జిల్లాలో విశాల కార్మిక ఐక్య పోరాటాల చరిత్ర కల్గిన ఎపి పేపరు మిల్లు కార్మికులు మరోసారి పోరుబాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం, హక్కుల సాధన కోసం గతంలో దశలవారీ ఉద్యమాలు నిర్వహించిన విషయం విధితమే. తాజాగా గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ఆందోళనలు చేపట్టారు. గత కొంత కాలంగా ఈ ఎన్నికలకు సాంకేతిక కారణాలు అడ్డుగోడలుగా నిలిచిన విషయం విధితమే. తాజా పరస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ కార్మికశాఖ, జిల్లా అధికార యంత్రాంగం చొరవ లోపించింది. దీంతో ఆగ్రహించిన కార్మిక సంఘాలు పోరాట మార్గాన్ని ఎంచుకున్నాయి. తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రజలకు పరిశుభ్రమైన నీళ్లు ఇవ్వండి: టికె

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ప్రజలకు రక్షిత మంచినీళ్ళు. స్నానానికి పరిశుభ్రమైన నీళ్ళు ఇవ్వాలని గోదావరి పరి రక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక మార్కండేయ స్వామి రేవులో ఆయన సమితి సభ్యులతో కలిసి గోదావరి లో పేరుకు పోయిన చెత్తా చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా గోదావరి పరిరక్షణ సమితిని ప్రారంభించామని చెప్పారు. దీని ద్వారా అనునిత్యం గోదావరి రేవులను శుభ్ర పరుస్తూ, పారిశుధ్యంపై చైతన్యం కలిగిస్తున్నట్లు చెప్పారు. తాగడానికి మంచి నీరు, స్నానం చేసేందుకు శు భ్రమైన నీళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తాను 46 రోజుల పాటు రిలే నిరాహారదీక్షలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విజయ రామ రాజు మున్సిపల్ కమిషనర్ గా ఉన్నపుడు గోదావరిలో చెత్త తొలగింపునకు ఓఎన్జీసీ సహకారంతో రూ 50 లక్షల ఖర్చు పెట్టి మిషన్ కొనుగోలు చేశారని, కొన్ని రోజులు ట్రైల్ రన్ నిర్వహించారని నెల తర్వాత ఆ మిషన్ కనిపించలేదని ఆరోపించారు. ఆ మిషన్, డబ్బు ఏమైపోయిందో తెలియలేదన్నారు. గోదావరి ప్రక్షాళన కోసం 'నమో నమామి' పథకం కింద ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రూ.54 కోట్లు మంజూరు చేశారని, అదే క్రమంలో తాము చేపట్టిన గోదావరి పరిరక్షణ ఉద్యమం ఫలితంగా సీఎం జగన్ సానుకూలంగా స్పందించి రూ 34 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ కింద విడుదల చేశారని, ఈ నిధులన్నీ ఏమయ్యాయని విశ్వేశ్వర రెడ్డి ప్రశ్నించారు. రాజమండ్రి పేపరు మిల్లు నుంచి 70 ఎంఎల్‌డి రసాయన వ్యర్థ జలాలు గోదావరిలో కలుస్తుండగా, కార్పొరేషన్ పరిధిలోని నల్లా చానళ్ల నుంచి 60 ఎం ఎల్ డి మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర రావు, అప్పారావు, కల్లి అప్పలరెడ్డి, సుబ్బరాజు, కొంచాడ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మార్కండేయ స్వామి ఘాట్‌ను శుభ్రం చేస్తున్న సభ్యులు

8న చలో తిరుపతిని జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి నినాదంతో ఈ నెల 8వ తేదీన తిరుపతిలో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో పార్టీ నగర కార్యవర్గ సమావేశం సీపీని రమణమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ బస్సు యాత్ర రాష్ట్రంలో విజయవంతంగా జరుగుతుందని అన్నారు. సిపిఐ బస్సు యాత్రలో అనేక ప్రజా సమస్యలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ కు ప్రజలు వివరించారని తెలిపారు. వైసిపి పాలన వల్ల ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వివిధ రూపాల్లో పన్నులు వేస్తూ ప్రజలను మానసిక ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. మోడీ సర్కార్ దేశానికి ప్రమాదకరంగా మారిందనీ ఆరోపించారు. మోడీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే ప్రమాదం లేకపోలేదన్నారు. రాష్ట్రంలో ఇసుక, మైనింగ్, మద్యం మాఫియాతో తాడేపల్లి పాలస్ డబ్బు చంచులతో మూలుగుతుందని ధ్వజమెత్తారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి కొండలరావు, సహ్యాకార్యదర్శి సప్ప రమణ, కార్యవర్గ సభ్యులు నల్ల రామారావు, వానపల్లి సూర్యనారాయణ, యడ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధు

ఇకపై పిహెచ్‌సిల్లో నిరంతర వైద్య సేవలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి అన్ని పీహెచ్ సీలలో నిరంతరం వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 24 గంటలూ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ఇప్పటికే సర్దుబాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే చాలా ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది కొరత వలన నిరంతర వైద్య సేవలు అందుతాయా లేదా అన్నది ప్రశ్నార్ధకంగా మారింది.

కాకినాడ జిల్లాలో కరప, పిఠాపురం మండలం విరవ, మల్లం,యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, రౌతులపూడి, జగ్గంపేట, గండేపల్లి తదితర ప్రాంతాల్లో 44 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్ సీ) లు ఉన్నాయి.వీటిల్లో ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, పార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, ఎంపీ హెచ్ఓ తదితర 14 మంది ఉండాలి.ఇందులో ఒకక్ డాక్టర్ పీహెచ్ సీకు వచ్చే రోగులకు వైద్యం అందించాలి. మరొకరు 104 వాహనం ద్వారా పీహెచ్సీ పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వెళ్లి ఉదయం నుంచి ఓపీ చూడటం, మధ్యాహ్నం నుంచి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్లు చేయించుకున్న రోగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, పాఠశాలల్లో విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య సేవలందించాలి.సిబ్బంది అంతా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీలోనే ఉండాలి.

24 గంటలూ సేవలు

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ప్రభుత్వం ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 24 గంటలు ఆసుపత్రిగా మార్పులు చేయ నుంది. ఇప్పటికే జిల్లాలో కొన్ని ముఖ్యమైన కేంద్రాల్లో నిరంతరం సేవలు అందిస్తు న్నామని ఉన్నతాధి కారులు తెలిపారు. ఇకనుంచి అన్ని చోట్ల ప్రజలకు వైద్య సేవలు అందించాలని భావిస్తు న్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులను మూడు షిఫ్టులుగా విధులు నిర్వహించేలా సర్దుబాటు చేయనున్నారు. అత్యవసర కేసులు వస్తే కాల్ డ్యూటీపై డాక్టర్లు సేవలు అందిస్తారని చెబు తున్నారు.అయితే అనేక ఆసుపత్రులలో సాయంత్రం 4 గంటలు దాటితే వైద్య సేవలు గగనంగా మారుతున్నాయి. పలుచోట్ల మధ్యాహ్నం వరకే వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ఆ తర్వాత సిబ్బంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్యం చాలా చోట్ల సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో 24 గంటలూ వైద్య సేవలు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలు చేస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పలుచోట్ల వైద్యుల పూర్తిస్థాయిలో నియామకం చేపట్టలేదు. సిబ్బంది కొరత కూడా వేధిస్తున్న మూలంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సెలవు రోజుల్లో వైద్యం గగనంగా మారుతుంది ఆదివారాలు ఇతర పండుగ రోజుల్లో అయితే వైద్యులు అందుబాటులో ఉండడం లేదని పలువురు రోగులు చెబుతున్నారు. ఇంకోవైపు వైయస్సార్ హెల్త్ క్లినిక్ లు కూడా ఎక్కడా అందుబాటులోకి రాలేదు.



యు.కొత్తపల్లిలోని పిహెచ్‌సి

బాధితులను ఆదుకోవడానికి చట్టాలు ఉపయుక్తం

ప్రజాశక్తి-అమలాపురం

బాధితవర్గాలను ఆదుకోవడానికి రాజ్యాంగం ద్వారా అనేక చట్టాలుఉన్నాయని, ఆ చట్టాలపై అవగాహన తెచ్చుకోవడంతోపాటు, ఆ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపునిచ్చారు. నల్సా న్యూ మద్యుయల్ మెగా లీగల్ సర్వీసెస్ క్యాంపును శనివారం జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ, జిల్లా పరిపాల యంత్రాంగం సమన్వయంతో ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ సమాజంలోని బాధిత వర్గాలను ఆదుకోవడానికి పలు చట్టాలు ఉన్నాయని, వీటిని వినియోగించుకోవడంలో ఆయా వర్గాలు విఫలమవుతున్నాయని, ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన పెంపొందించే విధంగా కార్యక్రమాలు జరగాలన్నారు. ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని వీటిని అరికట్టే విధంగా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయవలసి ఉందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఎలాంటి హక్కులు ఉండవని, వీరి గురించి ఆలోచన చేయవలసి ఉందన్నారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఏమైనా సమస్యలు వస్తే ఎవరి వద్దకు వెళ్లాలి..? ఏమి చెప్పాలి..? ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన ఉండదన్నారు. జిల్లాలో ఇలాంటి వర్గాల్లో కార్మిక శాఖతోపాటు న్యాయ సేవ సాధికారిక సంస్థలు అవగాహన కల్పించాలన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న వారికోసం ఇశ్రం ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. అసంఘటిత రంగంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 4 లక్షల మందిగా ఉన్నారని, వీరిలో రెండు లక్షల 50 వేల మందిని ఇప్పటికే గుర్తించడం జరిగిందని, మిగతా వారిని గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆలమూరు, మండపేట, కపిలేశ్వరం లాంటి ప్రాంతంలో ఇటుక బట్టి లలో బయట ప్రాంతాలను వచ్చే పని చేసే బాల కార్మికులను గుర్తించడం జరిగిందన్నారు. దీనిని అరికట్టేవిధంగా జాయింట్ యాక్షన్ టీం పని చేస్తున్నాయన్నారు. జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ, చైల్డ్ మ్యారేజెస్ సంఖ్య నమోదు అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలపై కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. బాల్య వివాహాల వల్ల అనర్థాలు జరుగుతున్నాయని పుట్టిన పిల్లల్లో పౌష్టికారమైన సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తూర్పు గోదావరి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరి కె .ప్రత్యూష కుమారి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ దిశగా ఇప్పటికే 50 క్యాంపులు నిర్వహించడం జరిగిందని 15 వేల మందిలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మహిళల రక్షణలో కేవలం విద్య ఒకటే సరిపోదని వాటితో పాటు ఒకేషనల్ కోర్సుల ఆవశ్యత ఉందని ఆ దిశగా సంస్థ పనిచేస్తుందన్నారు. బాధిత వర్గాలు న్యాయపరంగా తమకు న్యాయం చేయాలని తగు సమాచారం అందిస్తే ఎలాంటి మారుమూల ప్రాంతానికైనా వెళ్లి న్యాయం జరిగే విధంగా న్యాయవ్యవస్థ పనిచేస్తుందని అమలాపురం సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ చైర్మన్ మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వి. నరేష్ వెల్లడించారు. నల్సా ఆధ్వర్యంలోని జిల్లా న్యాయ సేవ సాధికారిక సంస్థ ముఖ్యంగా మూడు అంశాలపై పనిచేస్తుందన్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల హక్కు లను కాపాడడం, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంతోపాటు ఆడపిల్లల్లో గుడ్ టచ్ బాడ్ టచ్ పట్ల ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్లో ఉపాధ్యాయులు, హాస్టల్లో వార్డెన్లు అవగా హన కల్పించే విధంగా ప్రత్యేక దష్టి సారించడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో న్యాయపరంగా వచ్చే అర్జీల పరిష్కారంలో త్వరితగతిన పరిష్కరించే విధంగా ఒక న్యాయవాదిని ఏర్పాటు చేసి తమ వంతుగా జిల్లా యంత్రాంగానికి సహకారం అందిస్తామన్నారు. తొలితగా జడ్జిలు, జిల్లా కలెక్టర్ ఎమ్స్ కాలేజీ ఆవరణలో జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విభిన్న ప్రతిభావంతుల శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించి అక్కడ అమలు జరుగుతున్న పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జడ్జీలకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటు ఇతర అధికారులకు మెమొండోలతో సత్కరించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రామీణ అభివద్ధి సంస్థ చెందిన మహిళ గ్రూపులకు 22 కోట్ల 10లక్షల రూపాయల విలువ చేసే చెక్కును ఆయా సంఘాలకు అందిం చారు. అదేవిధంగా ఐసీడీఎస్ సంబంధించి గర్భిణి, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ అమలాపురం కె.శైలజ , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ బి..గౌరీ శంకర్రావు, ముమ్మిడివరం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మహమ్మద్ రహమతుల్లా, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, డిఆర్‌డిఏ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, లేబర్ డిపార్ట్మెంట, డిజేబుల్ డిపార్ట్మెంట్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

5న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-యానాం

యానాం ప్రాంతంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఈనెల 5న నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎ.ఈ.లంక కష్ణారావు తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆరోజు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకూ ఆయా సమస్యలపై విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రదానంగా విద్యుత్ అంతరాయం, లో ఓల్టేజ్, పనిచేయనిమీటర్ల మార్పు, పేరు బదిలీ, బిల్లుల సవరణ, బిల్లులు జారీ వంటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. నేరుగా వచ్చి ఫిర్యాదులు ఇవ్వలేని వారు ఈమెయిలు ద్వారా పంపవచ్చునని తెలిపారు.

ఎల్‌డిసి పరీక్షలో 13 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి-యానాం

పుదుచ్చేరి పాలనాసంస్కరణల విభాగం నిర్వహించిన ఎల్‌డిసి పరీక్ష ఫలితాలు శుక్రవారం రాత్రి విడుదలయ్యాయి. మొత్తం 165 ఎల్‌డిసి, 65 స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన (ర్వహించిన పరీక్షలో యానాం నుంచి రికార్డు స్థాయిలో ఎల్ డి సి 13 మంది,స్టోర్ కీపర్ కి ఏడుగురు రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఎంఎల్ఏ అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. కోచింగ్ అందించిన శ్రీనివాస కోచింగ్ సెంటర్ యాజమాన్యాన్ని అభినందించారు.



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లాడి

వైఎస్సార్‌కు పలువురి ఘన నివాళి

ప్రజాశక్తి-యానాం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం యానాం - ద్రాక్షారామ రోడ్లో గల ఆయన విగ్రహా నికి ప్రాంతీయ పరిపాలనాధికారి మునుస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతిఃధి మల్లాడి కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక నాయకులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

క్యాన్సర్ వ్యాధి నివారణ సాధ్యమే

డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా ఆ వ్యాధిని నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో క్యాన్సర్ ముందస్తు లక్షణాలు వాటి నివారణలో భాగంగా ప్రైవేటు హాస్పిటల్స్ సహకారంతో జిల్లాలో ఉన్న గ్రామాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ఏర్పాటు అంశంపై శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించడానికి ప్రైవేటు హాస్పిటల్స్ సహకారంతో జిల్లాలో ఉన్న గ్రామాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించినట్లయితే క్యాన్సర్‌ను అరికట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మనుషుల్లో తరచుగా వచ్చేటువంటి కొన్ని లక్షణాలను ముందుగా గుర్తింకి, స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా ముందస్తుగానే క్యాన్సరు గుర్తించవచ్చన్నారు. దీర్ఘకాలంగా మలబద్ధకం, డయేరియా, మూత్ర విసర్జనలో నొప్పి, ముత్రంలో రక్తం, తరచుగా మూత్రానికి వెళ్లాల్సి రావడం, శరీరంపై పుండ్లు ఏర్పడి చాలా కాలంపాటు మానకపోతే , నోట్లో చాలా కాలంపాటు పుండ్లు ఉండి, దగ్గినప్పుడు తెమడలో రక్తం పడటం, మలంతోపాటు రక్తం రావడం లేదా మలం నలుపు రంగులో కనిపించడం, రొమ్ములపై నొప్పిలేని గడ్డలు, రొమ్ములు లేదా చనుమొనల్లో నొప్పి... చనుమొనల నుంచి స్రావాలు కారడం వంటివి ఉంటాయన్నారు.